


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



దీక్షా దివస్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు

# కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం

## ధూంధాంగా దీక్షా దివస్

- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కొత్తజోష్
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు
- హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన నేతలు
- తెలంగాణ తల్లికి, అమరవీరులకు నివాళులు
- కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

దుండిగల్, నవంబర్ 29: దీక్షాదివస్ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో సరికొత్త జోష్ నింపింది. కార్యక్రమానికి ఆశించిన దానికన్న రెట్టింపు సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరుకావడంతో నేతలు, ప్రజాప్రతినిధుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2009 నవంబర్ 29న ఆమరణ దీక్షకు పూనుకుని శాంతియుత వాతావరణంలో తెలంగాణను సాధించిన నేపథ్యంలో ప్రతిఏడాది నవంబర్ 29న తెలంగాణ ప్రజానీకం దీక్షా దివస్‌ను నిర్వహించుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ సారి నిర్వహించిన దీక్షాదివస్‌కు కార్యకర్తలు, ప్రజలనుంచి విశేషస్పందన లభించింది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికాలంలోనే ప్రజలనుంచి కనీవినీ ఎరుగని రీతిలో వ్యతిరేకత వ్యక్తం అవుతున్న నేపథ్యంలో దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం(తెలంగాణ భవన్) ప్రాంగణంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అధ్యక్షతన నిర్వహించిన 'దీక్షాదివస్' ఊహించినదానికంటే విజయవంతమైంది. మేడ్చల్ జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పోటెత్తడంతో సభాప్రాంగణం గులాబీమయమైంది. సుమారు 3వేల పైచిలుకు కార్యకర్తలు నేతలు, ఇందులో పాల్గొనడంతో దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌తో సహా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్క్రీన్‌పై ఆనాటి చిత్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యమాలికను కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు. జై తెలంగాణ...జై కేసీఆర్ నినాదాలతో సభాప్రాంగణం మారుమోగింది. కార్యక్రమంలో జిల్లా పరిధిలోని ఐదునియోజకవర్గాల ఎమ్మెల్యేలతో పాటు జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, వివిధ మున్సిపల్ కార్పొరేషన్‌ల కార్పొరేటర్లు, మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అంతకు ముందు గండిమైసమ్మ చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

### తెలుగు విశ్వవిద్యాలయంలో..

బాచుపల్లిలోని పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీను నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం కళాశాల ఆవరణలో మహనీయుల విగ్రహాల ముందు బీఆర్‌ఎస్వీ జెండాలు పట్టుకొని జై తెలంగాణ, జై కేసీఆర్ అంటూ విద్యార్థి సంఘం నేతలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం బీఆర్‌ఎస్వీ నాయకుడు వాసు నాయక్, కృష్ణప్రసాద్ నాయక్, శ్రీదివ్య, శైలజ, ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## ఇబ్బందులకు వెరువం.. కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసుకుంటాం..



దీక్షా దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మియాపూర్, నవంబర్ 29: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరకు తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా పోరాడిన మహా ఉద్యమ నేత తొలి సీఎం కేసీఆర్ అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అదే ఉద్యమ స్ఫూర్తితో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నియోజకవర్గంలో ప్రజల కోసం నిలబడి కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేసుకునేందుకు పోరాడుతానన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని మేడ్చల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌ల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు తరలివెళ్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధనకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నవంబర్ 29న చేపట్టిన దీక్షా దివస్ చరిత్రాత్మకమైనదని, ప్రజాస్వామ్య బద్ధమైన పోరాటం లక్ష్యాన్ని ముద్దాడిందన్నారు. పదేండ్లలో తొలి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటమే కాక ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలిచారని ఎమ్మెల్యే కృష్ణారావు పేర్కొన్నారు. వైఫల్య కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూ రాబోయే రోజుల్లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేసుకునే వరకు విరామం లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

### కేసీఆర్ పోరాట ఫలితంగానే..

బాలానగర్: బీఆర్‌ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాట ఫలితం కారణంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి దూలపల్లిలో నిర్వహిస్తున్న దీక్షా దివస్ కార్యక్రమానికి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, సయ్యద్ ఎజాజ్, హరినాథ్, మట్టి శ్రీను కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### సుచిత్ర సెంటర్‌లో..

తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నేతలు క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమకారులు గుమ్మడి మధుసూదన్‌రాజు, తెలంగాణ ఆటోయూనియన్ నాయకులు జిందా, బిచ్చబాబు, శివ, యాదగిరి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గమ్మడి మధుసూదన్‌రాజు తదితరులు

### ప్రాణాన్నే ఫణంగా పెట్టిన కేసీఆర్..

మియాపూర్: స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా పోరాడి లక్ష్యాన్ని ముద్దాడాడని వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి దుండిగల్ వద్ద నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమాన్ని రోజాదేవి తరలివెళ్లారు. అంతకు ముందు డివిజన్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి కార్పొరేటర్ రోజాదేవి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

### దీక్షా దివస్‌కు భారీగా తరలిన నేతలు..

దుండిగల్‌లో నిర్వహించిన దీక్ష దివస్‌కు ఆల్విన్ కాలనీ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్ రావు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో తరలివెళ్లారు.



బాచుపల్లిలోని తెలుగుయూనివర్శిటీలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనునాయక్, తదితరులు



ఆల్విన్ కాలనీ డివిజన్ నుంచి పార్టీ శ్రేణులతో దీక్షా దివస్ వేడుకలకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీశ్‌రావు, తదితరులు



వివేకానందనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు



దీక్షా దివస్ కార్యక్రమానికి తరలివెళ్లిన ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, తదితరులు




గచ్చిబౌలి డివిజన్‌లో ఖాజగూడ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి దీక్షా దివస్ సందర్భంగా పార్టీ జెండాను అవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తదితరులు – శేరిలింగంపల్లి, నవంబర్ 29



## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు చేయూత

దుండిగల్, నవంబర్ 29: అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ శుక్రవారం జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు చేయూతనందించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో జరిగిన సెలక్షన్స్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పలువురు మహిళా క్రీడాకారులు కాసాని వీరేశ్ ముదిరాజును కలిసి ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరాగా.. స్పందించిన వీరేశ్ ముదిరాజ్ వారికి ఆర్థిక చేయూతనందించారు. దీంతో క్రీడాకారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఇన్‌కాయిస్‌కు సెర్చ్ అండ్ రెస్క్యూ అవార్డు

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ సమీపంలోని భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవాకేంద్రం(ఇన్‌కాయిస్) 2023–24 ఏడాదికి గాను సెర్చ్ అండ్ రెస్క్యూ (ఎస్ఏఆర్)అవార్డును గెలుచుకుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సముద్రంలో సంభావ్య శోధన ప్రాంతాలను అంచనా వేయడానికి ఇన్‌కాయిస్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఎయిడ్ టూల్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిందని తద్వారా సముద్రం లోపల సంభవించే ఆకస్మిక పరిస్థితులను అంచనా వేయడానికి ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌కాయిస్‌కు సెర్చ్ అండ్ రెస్క్యూ అవార్డ్ దక్కిందని స్పష్టం చేశారు. *– దుండిగల్, నవంబర్ 29*

## గృహిణి ఆత్మహత్య



స్రవంతి (ఫైల్)

కొండాపూర్, నవంబర్ 29: ఉరేసుకొని గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌నగర్‌లో నివాసం ఉండే నర్సింగ్‌రావు భార్య స్రవంతి (35) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా స్రవంతి ఆత్మహత్యకు పాల్పడే ముందు తన సోదరుడు సుధీర్‌కు ఫోన్ చేయగా, డ్రైవింగ్‌లో ఉన్న అతడు సమాధానం ఇవ్వలేదు. కొద్దిసేపటి తర్వాత తిరిగి ఫోన్ చేయగా స్రవంతి ఫోన్ ఎత్తలేదు. కాసేపటికే స్రవంతి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో సుధీర్ కుటుంబ సభ్యులకు తెలిపాడు. కాగా భర్త నర్సింగ్‌రావు వేధింపుల కారణంగానే స్రవంతి ఆత్మహత్యకు పాల్పడిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపూర్, నవంబర్ 29: గోపన్‌పల్లి తండా చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపన్‌పల్లి తండా చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిపై తేలియాడుతున్నట్లు అందిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అమాత్యులొస్తున్నారని.. ఆగమేఘాల మీద

### గుంతలు పూడ్చివేయించిన అధికారులు.. సామాన్యులకు మాత్రం నిత్యం నరకం





చందానగర్ సర్కిల్ పరిధిలోని అపర్ణ రోడ్‌లోని అమీన్‌పూర్ పోలీస్ బెటాలియన్‌లో ఓ కార్యక్రమానికి సీఎం సహా ఇతర మంత్రులు శుక్రవారం హాజరవుతున్నారన్న ముందస్తు సమాచారంతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు యుద్ధ ప్రాతిపదికన రహదారులపై గుంతలను దగ్గరుండి పూడ్చివేయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం సర్కిల్ ఇంజినీరింగ్ డీఈ, ఏఈ, ఇతర సిబ్బంది.. నెలల తరబడి గుంతలుగా ఉన్న రోడ్లకు ఆగమేఘాల మీద మరమ్మతులు చేశారు. ఎల్బీనగర్ ప్లాంట్ నుంచి డాంబర్ తెప్పించి మరీ అమాత్యుల రాకకోసం మరమ్మతులు చేయించారు. అయితే ఇదే దారిలో అపర్ణ నుంచి చందానగర్ జాతీయ రహదారి వైపునకు నిత్యం వందలాది వాహనాలు, విద్యాసంస్థల బస్సులు గుంతల దారిలోనే రాకపోకలతో తీవ్ర అసౌకర్యానికి గురైనా పట్టించుకోని అధికారులు.. ప్రభుత్వ పెద్దలు వస్తుండటంతో మేల్కొని రహదారికి మరమ్మతులు చేయటం పట్ల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ జోన్‌కు కొత్తగా వచ్చిన జోనల్ కమిషనర్ సైతం తొలినాళ్లలో ఈ దారిలో పర్యటించి రహదారులపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అయినా వారు నామమాత్రపు మరమ్మతులతో చేతులు దులుపుకొన్నారని, అదే అమాత్యులు వస్తున్నారని మాత్రం హడావిడిగా గుంతలన్నింటినీ పూడ్చివేయటంతో ఈ దారిలో నెలల తరబడి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

*– మియాపూర్, నవంబర్ 29*

## సైబర్ మోసాలపై అవగాహన, అప్రమత్తత తప్పనిసరి

జగద్గిరిగుట్ట, నవంబర్ 29: ఆన్‌లైన్ విధానం.. పనుల్లో వేగం పెరిగిన నేపథ్యంలో టెక్నాలజీపై అవగాహన తప్పనిసరని సీఐ నర్సింహ సూచించారు. జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లో గురువారం రాత్రి సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలను నివారించడంపై స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో అతితక్కువ ధరకే వస్తువులు, లాటరీ, ఉద్యోగం, పెట్టుబడులు అంటే నమ్మవద్దని తెలిపారు. డిజిటల్ అరెస్ట్, అశ్లీల వీడియోలు, కొరియర్ అంటే జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, బ్యాంకు వివరాలు ఎట్టి పరిస్థితిల్లో అపరిచితులకు చెప్పవద్దన్నారు. అనుమానాస్పద యాప్, లింక్, వీడియోలను తెరవడం ఇతరులకు పంపకూడదన్నారు. సైబర్ మోసం అన్న సందేహం వస్తే 1930లేదా, పోలీసులను సంప్రదించాలని సూచించారు. నేరాల నియంత్రణకు పోలీసులతో సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, ఎస్ఐ శంకర్, విఠల్, సీహెచ్ దాసు, మౌనిక, మురళి, సాయి పాల్గొన్నారు.

## బౌరంపేట్‌లో ప్రభుత్వ యోగా సెంటర్ ప్రారంభం..

దుండిగల్, నవంబర్ 29: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లోని వార్డు కార్యాలయంలో శుక్రవారం యోగా సెంటర్ ప్రారంభమైంది. ఆయుష్, హోమియోపతి హెల్త్ అధికారులు డా.లలిత, డా.పి.రాజ్ మోహన్ సంయుక్తంగా శుక్రవారం బౌరంపేట్‌లో యోగా శిక్షకులను పరిచయం చేసి, మనిషి ప్రతి రోజు తప్పనిసరిగా యోగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగా శిక్షణ తరగతుల ఏర్పాటుకు బౌరంపేట్‌లోని ఆయుష్, హోమియోపతి విభాగాల ద్వారా ఇద్దరు యోగా శిక్షకులను ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. ఇక నుంచి ఇద్దరు యోగా టీచర్లు శిరీష, సాయికృష్ణ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా యోగాతో నయం అవుతుందని వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు శిరీష, డి.సాయికృష్ణ, నాయకులు పీసరి కృష్ణారెడ్డి, నల్ల రామచంద్రారెడ్డి, సరుగారి సత్తిరెడ్డి, గోనె మల్లారెడ్డి, అర్.నర్సింహాచారి, డీ.ప్రభాకర్‌రెడ్డి, కమ్మరి రమేశ్ చారి, నల్ల రాజిరెడ్డి, కొమ్ము ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

అల్లాపూర్, నవంబర్ 29: స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు అధికారులు వెంటనే స్పందించి సత్వరమే సమస్యలు పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని కార్పొరేటర్ సబీహాబేగం తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఆర్కే సొసైటీలో బస్తీ దవాఖానను అధికారులతో కలిసి పరిశీలించారు. దవాఖానకు సరిపడా సిబ్బంది, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా.. అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్కే సొసైటీలో కమ్యూనిటీహాల్‌ను నిర్మించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. కాలనీవాసుల సమస్యలు విన్న కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి కమ్యూనిటీహాల్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన్నట్లు తెలిపారు.

## దోమల నివారణకు చర్యలు

మియాపూర్, నవంబర్ 29: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయు విహార్ కాలనీలో కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో కలిసి భీముని కుంట చెరువును పరిశీలించారు. గుర్రపు డెక్క వ్యర్థాలతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. దోమల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జగద్గిరిగుట్ట, నవంబర్ 29: పరిసరాల పరిశుభ్రత పాటించాలని కార్పొరేటర్ జగన్ కోరారు. జగద్గిరిగుట్టలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహనలో స్థానికులతో కలిసి పాల్గొన్నారు. కార్మికులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసి ర్యాలీలో పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌కు శుభాకాంక్షలు

మియాపూర్, నవంబర్ 29: ఆర్‌జీయూ కేటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ గోవర్ధన్‌ను జేఎన్‌టీయూహెచ్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గర్ సందీప్, కార్యవర్గ సభ్యులు అంబటి తేజ, దాస్యం విక్రాంత్, పవన్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్‌టీసీ డిపోలో కార్తిక వన భోజనాలు

మియాపూర్, నవంబర్ 29: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మియాపూర్ ఆర్‌టీసీ డీపో–2లో శుక్రవారం కార్తిక వన భోజనాల కార్యక్రమాన్ని ఎండీ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు పూజలతో పాటు ప్రత్యేక పూజాదికాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సిబ్బంది సందడిగా గడిపారు. అనంతరం సిబ్బంది సామూహికంగా భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపు, అత్యధిక ఆదాయం, సమర్థ బస్సుల నిర్వహణకు కృషి చేసిన సాంకేతిక సిబ్బందిని డీఎం వెంకటేశం అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎం, ఏఈ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కూకట్‌పల్లి డిపోలో..

బాలానగర్: కూకట్‌పల్లి డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమానికి కూకట్‌పల్లి డిపో ఉద్యోగులతో పాటు డిపో మేనేజర్ హరి, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ ఇంజినీర్ రాజేశ్వరి హాజరయ్యారు. ఉద్యోగులందరూ కలిసి భోజనాలు చేసి ఐఖ్యతను చాటారు.

దుండిగల్, నవంబర్ 29: జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం పలుప్రాంతాల్లో రాంగ్‌సైడ్ నడిపే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం టీ–జంక్షన్(ఉషోదయచౌరస్తా)తో పాటు సూరారం చౌరస్తా వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగ్‌సైడ్‌లో వచ్చే వాహనదారులను ఆపి వారికి కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు జరిమానా సైతం విధించారు. అదే సమయంలో నంబర్‌ప్లేట్ లేని వాహనాలను సైతం గుర్తించి చలానాలు విధించారు. మొత్తం 60 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.